ప్రజాశక్తి
శుక్రవారం 8 డిసెంబరు 2023
5
శ్రీకాకుళం

పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలో చేపడుతున్న ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై ప్రత్యేక దృష్టిసారించాలని అదనపు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఎం.ఎన్ హరేంద్ర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో పెండింగ్ దరఖాస్తులపై విజయవాడ నుంచి గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది మంది కంటే ఎక్కువ ఉన్న ఓటర్లు, వందేళ్లు నిండిన వాటిని పున: పరిశీలించి వారం లోగా ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ముసాయిదా జాబితా విడుదల చేసే అక్టోబరు 27వ తేదీ నాటికి 0-0 నంబరుతో ఉన్న 2,206 ఓటర్లను గుర్తించామని, వాటి సంఖ్యను 114కి తగ్గించగలిగామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు పాల్గొన్నారు.

మరో సామూహికానికి సన్నాహాలు

ఆమదాలవలస : గాజులకొల్లివలస లేఅవుట్‌లో అసంపూర్తిగా ఉన్న ఇళ్లు

- రెండో విడతలో 15,659 గృహాలు ప్రారంభం
- ఫిబ్రవరి నెలాఖరుకు పూర్తి చేయాలని ఆదేశం
- గృహ నిర్మాణాలకు సంబంధించి పలు మార్గదర్శకాలు జారీ
- అధికారుల కసరత్తు

రాష్ట్రవ్యాప్తంగా మరోసారి సామూహిక గృహ ప్రవేశాలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ఏడాది అక్టోబరు 12న రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతగా గృహ ప్రవేశాలను ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇదే ఉత్సాహంతో రెండో విడతకు సమాయత్తమవుతోంది. ఇందులో భాగంగా రెండో విడత గృహ ప్రవేశాలకు దిశానిర్దేశం చేస్తూ పలు మార్గదర్శకాలను వెలువరించింది. జిల్లాకు సంబంధించి నిర్దిష్ట లక్ష్యాలను విధించింది. వచ్చే ఏడాది జనవరి నెలాఖరు నాటికి పూర్తి చేయాలని ఆదేశించింది. ఫిబ్రవరి 15వ తేదీ లోగా గృహాలను ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని సూచించింది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు (ఎన్‌పిఐ) పథకంలో భాగంగా జిల్లాకు 74,811 ఇళ్లు మంజూరయ్యాయి. వీటిలో మొదట విడతగా ఈ ఏడాది అక్టోబర్ 12న 26,930 మందితో గృహ ప్రవేశం చేయించారు. రెండో విడతలో 15,659 మందితో గృహ ప్రవేశాలు చేయించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. ఇందులో అర్బన్ ప్రాంతంలో 4,903 ఇళ్లు, గ్రామీణ ప్రాంతంలో 10,756 ఇళ్లు ఉన్నాయి. ఆమదాలవలస అర్బన్‌లో 438 ఇళ్లు, ఇచ్ఛాపురంలో 542, పలాస-కాశీబుగ్గలో 862, శ్రీకాకుళం అర్బన్‌లో 3061 ఇళ్లు ఉన్నాయి. మెళియాపుట్టిలో అత్యధికంగా 859 ఇళ్లను సామూహిక గృహ ప్రవేశాలకు సిద్ధం చేయనున్నారు. సోంపేటలో 722, నరసన్నపేటలో 663 ఇళ్లు, రణస్థలంలో 637 ఇళ్లు ఉన్నాయి.

రెండో విడత నిర్మాణాలకు మార్గదర్శకాలు ఇవే...

సామూహిక గృహ ప్రవేశాలకు సంబంధించి ప్రభుత్వం పలు మార్గదర్శకాలను వెలువరించింది. మొదటి విడతలో చేపట్టిన మాదిరిగానే ప్రతి లేఅవుట్‌లో వంద కంటే ఎక్కువ ఇళ్లను జనవరి నాటికి పూర్తి చేయాలని సూచించింది. లేఅవుట్ వద్ద స్వాగత తోరణం, ఇంకుడుగుంతలు, ప్రతి ఇంటికీ తాగునీరు, విద్యుత్ సరఫరా అందించడంతో పాటు రంగులు వేసి నిర్ణీత సమయానికి పూర్తి చేయాలని పేర్కొంది. ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి ఇప్పటివరకు పలు దశల్లో ఉన్న ఇళ్లను లక్ష్యంలో భాగంగా పూర్తి చేయాలని తెలిపింది. ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన ఇటుకలు, సెంట్రింగ్ మెటీరియల్ అందేలా చూడాలని సూచించింది. గృహ నిర్మాణాల వేగవంతానికి జిల్లా, మండల, మున్సిపాలిటీ, సెక్రటేరియట్ స్థాయిల్లో అధికారులతో సమావేశాలు నిర్వహించాలని పేర్కొంది. గృహ నిర్మాణాల పూర్తికి ఆయా స్థాయిల్లో అధికారులు చేపట్టాల్సిన పనులపై స్పష్టంగా పేర్కొంది.

నిర్మాణాలకు ముందుకొచ్చేనా?

రెండో విడత సామూహిక గృహ ప్రవేశాలకు ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించినా, అవి ఎంతవరకు పూర్తవుతాయన్న సందేహం వ్యక్తమవుతోంది. లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణం భారంగా మారడమే ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.80 లక్షలు చెల్లిస్తోంది. ప్రభుత్వం అందిస్తున్న సాయం కంటే మరో రెండింతలు ఖర్చు చేయాల్సి రావడంతో, చాలా మంది వెనక్కి తగ్గుతున్నారు. అప్పులు చేసి ఇళ్లు కట్టేందుకు ఇష్టపడడం లేదు. ఇళ్ల పట్టాలు దక్కడం ఒక ఆస్తిగానే అత్యధిక మంది భావిస్తున్నారు తప్ప ఇళ్లు నిర్మించుకుని అక్కడకు తరలివెళ్లేందుకు ఆసక్తి కనబరచడం లేదు. స్థానికంగా చిన్న చిన్న వ్యాపారాలు, పలురకాల వృత్తులు చేసుకుంటున్న వారు కాలనీలకు తరలివెళ్తే అక్కడ ఏం పనులు, వ్యాపారం జరుగుతాయంటూ నిరాసక్తత కనబరుస్తున్నారు. ఫలితంగా ఇళ్ల నిర్మాణాల లక్ష్యం ముందుకు సాగడం లేదు. మొదట విడత లక్ష్యం చేరుకోవడానికి అధికారులు బాగా శ్రమించాల్సి వచ్చింది. లబ్ధిదారులను ఒప్పించో, ఇళ్లు కట్టపోతే పట్టాలు తీసుకుంటామని బెదిరించో ఏదో విధంగా గృహ ప్రవేశాల కార్యక్రమం పూర్తి చేశారు. ప్రభుత్వం తాజాగా రెండో విడత సామూహిక గృహ ప్రవేశాలకు లక్ష్యాలను నిర్దేశించడంతో అధికారులు మరోసారి ఉరుకులు పరుగులు పెడుతున్నారు.

15న పలాసలో సిఎం పర్యటన

ప్రజాశక్తి - పలాస

కలెక్టర్, ఎస్‌పితో మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి ఈనెల 15వ తేదీన శ్రీకాకుళం జిల్లాలో పలాసలో పర్యటించనున్నట్లు రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు వెల్లడించారు. పలాసలోని 200 పడకల ఆస్పత్రి, కిడ్నీ పరిశోధనా కేంద్రాన్ని ప్రారంభించనున్నారని చెప్పారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసే బహిరంగ సభలో సిఎం ప్రసంగిస్తారని తెలిపారు. సిఎం పర్యటన నేపథ్యంలో హెలీప్యాడ్ స్థలం, బహిరంగ సభ ప్రాంతాలను కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ఎస్‌పి జి.ఆర్ రాధికతో కలిసి గురువారం పరిశీలించారు. బహిరంగ సభకు వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని మంత్రి సూచించారు. బహిరంగ సభ ప్రాంగణంలో వాహనాల పార్కింగ్, విఐపి గ్యాలరీ ఏర్పాటు చేయాలని చెప్పారు. హెలీప్యాడ్‌ను సిద్ధం చేస్తున్న లేఅవుట్‌లో విద్యుత్ స్తంభాలను తొలగించి, సిఎం పర్యటన అనంతరం తిరిగి ఏర్పాటు చేయాలని కలెక్టర్ విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. ఆస్పత్రి నుంచి బహిరంగ సభ నిర్వహించే కాశీబుగ్గ రైల్వే మైదానం వరకు బారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పలాస ఆర్‌డిఒ భరత్ నాయక్, కాశీబుగ్గ డిఎస్‌పి నాగేశ్వర్‌రెడ్డి, ఆర్‌అండ్‌బి ఎస్ఇ జాన్ సుధాకర్, ఇఇ సత్యనారాయణ, ఇపిడిసిఎల్ ఎస్ఇ ఎన్.కృష్ణమూర్తి, డిపిఒ రవికుమార్‌తో పాటు పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రూ.ఐదు వేల కోట్లు విడుదల చేయాలి

కేంద్రాన్ని కోరిన ఎంపీ రామ్మోహన్‌నాయుడు

శ్రీకాకుళం అర్బన్ : తీవ్ర వర్షాభావ పరిస్థితులు, తుపాను సమస్యలతో సతమతమవుతున్న ఆంధ్రప్రదేశ్ రైతాంగాన్ని ఆదుకునేలా తక్షణ సాయంగా రూ.ఐదు వేల కోట్లు విడుదల చేయాలని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో జీరో అవర్‌లో ఆయన గురువారం ప్రస్తావించారు. రాష్ట్రంలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 25 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని గుర్తుచేశారు. రాష్ట్రంలో మొత్తం 470 మండలాల్లో కరువు పరిస్థితులు ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం కేవలం వంద మండలాలనే గుర్తించిందన్నారు. దీనివల్ల రైతులకు కనీసం ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా దక్కకుండా చేస్తున్నారన్నారు. శ్రీకాకుళం జిల్లాలో ఇచ్ఛాపురం, సోంపేట, కవిటి, మందస, వజ్రపుకొత్తూరు తదితర మండలాల్లో సుమారు 60 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని తెలిపారు. దీంతో రైతులు పంటలు కోల్పోయారని, మిగిలి ఉన్న పంట చేతికందే సమయంలో మిచౌంగ్ తుపాను ముంచేసిందని వివరించారు. కేంద్ర అధికారుల బృందం వెంటనే పంట నష్టాలను అంచనా వేసి, ప్రకృతి ప్రకోపంతో విలవిల్లాడుతున్న రాష్ట్రాన్ని ఆదుకోవాలని కోరారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం లీగల్, ఆమదాలవలస, ఇచ్ఛాపురం

విధులు బహిష్కరించి నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

ఎపి ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్-23ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ న్యాయవాదులు రెండో రోజు గురువారం విధులు బహిష్కరించారు. ఇందులో భాగంగా శ్రీకాకుళం జిల్లా కోర్టు, ఆమదాలవలస, ఇచ్ఛాపురం కోర్టుల ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎన్ని సూర్యారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తెచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌లో పొందుపరిచిన సెక్షన్ 37, 38, కొన్ని ప్రావిజన్లలో పేర్కొన్న అంశాలు ప్రజలకు, న్యాయవాదులకు గొడ్డలిపెట్టు వంటిదన్నారు. సివిల్ కోర్టుల పరిధి నుంచి పూర్తిగా లిటిగేషన్‌ను తప్పించి, ప్రభుత్వమే ఒక ప్రత్యేక అధికారిని నియమించి లిటిగెంట్ పబ్లిక్ ఆస్తిపై హక్కులను పరిష్కరించి తీర్పు వెలువరించే అధికారం ఇచ్చిందన్నారు. ఆ అధికారి ఇచ్చే తీర్పుపై స్థానిక సివిల్ కోర్టులకు కాకుండా హైకోర్టుకు మాత్రమే అధికారం ఉంటుందన్నారు. దీనివల్ల న్యాయవాదుల భవిష్యత్ ప్రశ్నార్థకమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సామాన్యులకు న్యాయం దూరమవుతుందన్నారు. అధికారుల చేతుల్లోకి వెళ్లడం ద్వారా రాజకీయ ఒత్తిళ్లకు లొంగే ప్రమాదముందని హెచ్చరించారు. ఈ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌పై ఈనెల ఎనిమిదో తేదీ వరకు న్యాయవాదులు విధులు బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రాము, ఎం.భవానీ ప్రసాద్, బార్ అసోసియేషన్ రాష్ట్ర సభ్యులు జి.వాసుదేవరావు, శిష్టు రమేష్, ఎపి బిసి అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎ.ఉమామహేశ్వరరావు, చౌదరి లక్ష్మణరావు, ఆమదాలవలస, ఇచ్ఛాపురం బార్ అసోసియేషన్ల అధ్యక్షులు కె.విజయలక్ష్మిభాయి, ఆర్.దేవరాజు, బి.వరహానరసింహం, టి.అన్నంనాయుడు, ఎన్.సి సాహు, సీతయ్యరెడ్డి, కృష్ణమూర్తి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఉన్నతి' కింద మహిళా శక్తి ఆటోలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఆటో నడిపే మహిళలను మరింత మంది మహిళలు స్ఫూర్తిగా తీసుకోవాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. కలెక్టరేట్‌లో ఆవరణలో ఉన్నతి యూనిట్ ద్వారా 13 ఆటో రిక్షాలను గురువారం జెండా ఊపి ప్రారంభించారు. ముందుగా ఆటో రిక్షాల తాళాలు, మంజూరు పత్రాలను మహిళా లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరిక నిర్మూలనా సంస్థ (సెర్ప్) ఉన్నతి కార్యక్రమంలో నిరుపేదలైన ఎస్‌సి, ఎస్‌టి మహిళలకు వడ్డీ లేని రుణంతో మహిళా శక్తి పథకంలో ఆటో రిక్షాల పంపిణీ కార్యక్రమం మంచి కార్యక్రమన్నారు. ఉన్నతి యూనిట్ ద్వారా మహిళా శక్తి ఆటో లబ్ధిదారుల ఎంపికకు లబ్ధిదారులు స్వయం సహాయక సంఘాల్లో సభ్యులై ఉండి ఎస్‌సి, ఎస్‌టిలకు చెందిన వారై ఉండాలన్నారు. లబ్ధి పొందే మహిళల వయసు 20 దాటి 45 ఏళ్ల లోపు ఉండాలని, తప్పనిసరిగా ఎల్‌ఎల్‌ఆర్, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని స్పష్టం చేశారు. ఆటో కొనుగోలు చేసేటప్పుడు లబ్ధిదారులు పది శాతం వాటా చెల్లించాలని, గతంలో తీసుకున్న ఉన్నతి, స్త్రీ నిధి అప్పు శతశాతం తీర్చిన వారికి అవకాశం ఉంటుందన్నారు. జిల్లాలో మొత్తం 13 మండలాలకు సంబంధించి 13 మంది లబ్ధిదారులు ఆటో కొనుగోలు కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. లబ్ధిదారుల వాటా కింద రూ.4.27 లక్షలు, వడ్డీ లేని రుణం రూ.36,18,935 ఉన్నతి యూనిట్ ద్వారా మంజూరు చేసినట్లు చెప్పారు. 48 వాయిదాల్లో ఎటువంటి వడ్డీ లేకుండా తిరిగి చెల్లించాలన్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

జిల్లాలో ఐటిడిఎ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

సమావేశంలో మాట్లాడుతున్న గోవిందరావు

జిల్లాలో ఐటిడిఎను ఏర్పాటు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కమిటీ సభ్యులు ఎన్.షణ్ముఖరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో పార్టీ నాయకులు కొల్లి ఎల్లయ్య అధ్యక్షతన గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాలో ఐటిడిఎ లేకపోవడం వల్ల గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొంతమంది తప్పుడు పత్రాలను సృష్టించి గిరిజన భూములను అన్యాక్రాంతం చేస్తున్నారని చెప్పారు. గిరిజనులకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. గిరిజనుల సాగులో ఉన్న భూమికి గిరిజనులకే పట్టాలు ఇవ్వాలన్నారు. గిరిజన గ్రామాలను షెడ్యూల్ ఏరియాలో చేర్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు వెంటనే తెరిచి ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. తుపాను కారణంగా వర్షాల వల్ల తడిచిన, రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. తుపానుతో నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు హెచ్.ఈశ్వరరావు, పి.సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సాయుధ దళాల పతాక నిధికి విరాళాలు అందించాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

విరాళాన్ని అందజేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

సాయుధ దళాల పతాక నిధికి అందరూ విరాళాలను అందించాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబరులో సాయుధ దళాల పతాక దినోత్సవానికి సంబంధించిన పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ తనవంతు విరాళాన్ని అందించారు. పాకిస్థాన్, చైనా యుద్ధ సమయాల్లో, కార్గిల్ పోరాటంలో, ముంబై తాజ్ హోటల్ దురాక్రమణ సమయంలో, ప్రకృతి వైపరీత్యాల సమయంలో మన సైనికుల ధైర్య సాహసాలు, తెగువకు దేశం గర్విస్తోందన్నారు. ఎంతోమంది సైనికులు దేశ రక్షణ కోసం తమ ప్రాణాలు అర్పించినట్లు చెప్పారు. వీర జవాన్లకు వందనం సమర్పించేందుకు, వారి కుటుంబాలకు చేయూతనిచ్చేందుకు సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని ఏటా డిసెంబరు ఏడో తేదీన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాయుధ దళాల పతాక దినోత్సవానికి జిల్లాలోని పౌరులు, వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలను కోరారు. మీరు అందించే విరాళాలను, డైరెక్టర్, సైనిక వెల్ఫేర్, విజయవాడ పేరున చెక్కు, డ్రాఫ్ట్ తీసి జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయం, పెద్దరెల్లివీధి, శ్రీకాకుళంకు పంపాలని కోరారు. పతాకనిధికి అందించే విరాళాలకు ఆదాయ పన్ను రాయితీ లభిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి ఎ.శైలజ, మాజీ సైనికుల సంఘం జిల్లా అధ్యక్షులు కె.పూర్ణచంద్రరావు, ఉపాధ్యక్షులు వి.సూర్యనారాయణ, నేవీ ప్రతినిధి ఎస్.రమణమూర్తి, ఆర్మీ ప్రతినిధి పి.మురళీధరరావు తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మాట్లాడుతున్న సన్యాసినాయుడు

గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు నేరమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. జిల్లా కోర్టులోని న్యాయసేవా సదన్‌లో గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టంపై గురువారం నిర్వహించిన న్యాయ అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షలు చేసే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్కానింగ్ సెంటర్లు ఇటువంటి విషయాల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ బి.శాంతి శ్రీ, జిల్లా బాలల సంరక్షణ అధికారి కె.వి రమణ, న్యాయవాది జి.ఇందిరాప్రసాద్, సిడిపిఒ శోభ, అంగన్వాడీ, మెప్మా కార్యకర్తలు పాల్గొన్నారు. చిన్న పిల్లలను పనిలో పెట్టుకోవడం నేరమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు అన్నారు. కార్మికశాఖ, బాలల సంరక్షణ, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్, బ్రెడ్స్ స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా నగరంలోని జిటి రోడ్డులోని షాపుల్లో బాల కార్మికుల రెస్క్యూ ఆపరేషన్‌ను గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సర్కిల్ వన్ శైలేష్ కుమార్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఎస్ఐ కేశవరావు, రెండో పట్టణ ఎఎస్ఐ శంకరరావు, చైల్డ్‌లైన్ సూపర్‌వైజర్ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సురక్షిత నీరు

శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - సరుబుజ్జిలి, ఆమదాలవలస, బూర్జ

ఆమదాలవలస నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ జల్ జీవన్ మిషన్ పథకంలో భాగంగా సురక్షిత తాగునీటిని అందించేందుకు కృషి చేస్తున్నట్లు శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. సరుబుజ్జిలి మండలం వీరమల్లిపేట, సింధువాడలో జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ మంచినీటి కుళాయిలను గురువారం ప్రారంభించారు. అనంతరం అదే గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి నాలుగున్నరేళ్లలో ఆ కుటుంబానికి అందిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛమైన తాగునీటిని అందించడం ద్వారా వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో సరుబుజ్జిలి ఎంపిపి కె.వి.జి సత్యనారాయణ, వైస్ ఎంపిపి ఎల్.అనిల్ కుమార్, శివానందబాబు, వైసిపి మండల అధ్యక్షులు బెవర మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బూర్జ మండలం పాలవలసలో పలు అభివృద్ధి కార్యక్రమాలను స్పీకర్ తమ్మినేని సీతారాం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిపి కె.దీప, జెడ్‌పిటిసి బి.రామారావు, వైసిపి మండల అధ్యక్షులు కె.గోవిందరావు, వైస్ ఎంపిపి కె.కృష్ణంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్ తమ్మినేనిని నిలదీస్తున్న రామరాజు

సమస్యలపై నిలదీత

సరుబుజ్జిలి మండలం వీరమల్లిపేటలో నెలకొన్న పలు సమస్యలపై స్పీకర్ సీతారాంను స్థానికులు నిలదీశారు. గ్రామంలో కాలువల్లేకపోవడంతో వర్షాలు కురిస్తే ఇంటి గుమ్మంలోకి మురుగునీరు చేరుతోందని, దీంతో రోగాల బారిన పడుతున్నామని మహాలక్ష్మి, మట్ట దమయంతి స్పీకర్ దృష్టికి తీసుకొచ్చారు. కాలువలు, రహదారులు నిర్మించకుండా కొంతమంది అడ్డుకుంటున్నారని వైస్ ఎంపిపి శివానంద మూర్తి స్పీకర్‌కు చెప్పారు. ఎవరు అడ్డుకుంటున్నారని, నిధులు మంజూరు చేసి వెంటనే పనులు చేపట్టాలని గ్రామానికి చెందిన రామరాజు చెప్పారు.

విలేకరిపై దురుసు ప్రవర్తన

సమస్యలపై స్థానికులు నిలదీస్తున్న ఫొటోలను తీస్తున్న ప్రజాశక్తి విలేకరి డి.శ్రీనివాసరావుపై స్పీకర్ సీతారాం, వైసిపి నాయకులు దురుసుగా ప్రవర్తించారు. విలేకరి ఫోన్, గుర్తింపు కార్డును స్పీకర్ భద్రతా సిబ్బంది లాక్కొని దుర్భాషలాడారు. ప్రజా క్షేత్రంలో ప్రజలు కొన్నిసార్లు అడుగుతుంటారని, అవి కామన్ అని వాటిని పత్రికల్లో రాయాల్సిన అవసరం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసిపి నాయకులు, స్పీకర్ భద్రతా సిబ్బంది ఫోన్‌లో ఫొటోలు, వీడియోలను తొలగించి ఫోన్, గుర్తింపుకార్డును తిరిగి ఇచ్చారు. ఈ ఘటనతో అక్కడున్న వారు ఒక్కసారిగా అవాక్కయ్యారు. స్పీకర్ స్థానంలో ఉన్న వ్యక్తి విలేకరిపై చిందులు తొక్కడం సరికాదని అక్కడున్న వారు చర్చించుకున్నారు.

మహారాజశ్రీ పొందూరు జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
OS 85/2021

Between:
ఎన్ని గోవిందరావు --వాది
And:
పేడాడ రాజారావు --ప్రతి వాది
To,
పేడాడ రాజారావు, S/o లేటు సత్యం, సా॥ దవళపేట, జి.సిగడాం మండలం, శ్రీకాకుళం జిల్లా.

పైనెంబరు వాది మీపైన దావా ప్రాంసరీ నోటు రాబట్టే నిమిత్తం పై నెంబరు దావాను దాఖలు చేసియున్నారు. మీరు పై కోర్టు వారి సమక్షమందు **తేది 26-12-2023 న ఉదయం 10.30 గం॥లకు** హాజరై మీకుగల ఆక్షేపణలు తెలియజేసుకోవలెను. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించడం అగునని యిందు మూలంగా తెలియచేయడమైనది.

// శ్రీ కోర్ట్ వారి ఆర్డర్ మేరకు //

కె. రమణ మూర్తి
బి. మంజుల
వాది తరుపు న్యాయవాదులు,
పొందూరు.

మహారాజశ్రీ పొందూరు జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
OS 48/2022

Between:
యతిరాజుల అప్పన్న ......వాది
And:
చింతాడ చంద్రయ్య వగైరాలు .....ప్రతివాదులు
నోటీసు
D1. చింతాడ చంద్రయ్య, S/o జోగులు గారి సత్యం (బోర్డరు సెక్యూరిటీ ఫోర్సు, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం) గోకర్ణపల్లి గ్రామం, పొందూరు మండలం, శ్రీకాకుళం జిల్లా.
D2. సంపతిరావు వసంతనాయుడు, S/o ఎరకయ్య, గోకర్ణపల్లి గ్రామం, పొందూరు మండలం, శ్రీకాకుళం జిల్లా.

పై నెంబరు దావాను వాది మీరువురుపై దాఖలు చేసినందున మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల **తే 18-12-2023దీన ఉదయం 10-30 ని॥లకు** పై కోర్టువారి ఎదుట హాజరై మనవి చేసుకోవలెను. అటులు మీరు హాజరు కాని యెడల మిమ్ములను ఎక్సుపార్టీ చేసి మీ పరోక్షమందు వాదికి అవసరమగు ఆర్డరు జారీ చేయడమగునని యిందు మూలంగా తెలియజేయడమైనది.

సి.హెచ్. పకీరునాయుడు
వాది తరుపు న్యాయవాది,
పొందూరు

మహారాజశ్రీ పొందూరు జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
IA 98/2012 in OS 48/2022

Between:
యతిరాజుల అప్పన్న ......పిటిషనరు/వాది
And:
చింతాడ చంద్రయ్య వగైరాలు
...రెస్పాండెంట్లు/ప్రతివాదులు
నోటీసు
R1. చింతాడ చంద్రయ్య, S/o జోగులు గారి సత్యం (బోర్డరు సెక్యూరిటీ ఫోర్సు, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం) గోకర్ణపల్లి గ్రామం, పొందూరు మండలం, శ్రీకాకుళం జిల్లా.
R2. సంపతిరావు వసంతనాయుడు, S/o ఎరకయ్య, గోకర్ణపల్లి గ్రామం, పొందూరు మండలం, శ్రీకాకుళం జిల్లా.

పై నెంబరు దావాలో పై నెంబరు పిటిషనను పిటిషనరు/వాది మీరిరువురిపై దాఖలు చేసినందున మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల **తే 18-12-2023దీన ఉదయం 10-30 ని॥లకు** పై కోర్టువారి ఎదుట హాజరై మనవి చేసుకోవలెను. అటులు మీరు హాజరు కాని యెడల మిమ్ములను ఎక్సుపార్టీ చేసి మీ పరోక్షమందు వాదికి అవసరమగు ఆర్డరు జారీ చేయడమగునని యిందు మూలంగా తెలియజేయడమైనది.

సి.హెచ్. పకీరునాయుడు
వాది తరుపు న్యాయవాది,
పొందూరు

మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

రైతులకు నష్టపరిహారం అందజేయాలి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మిచౌంగ్ తుపాన్ కారణంగా వరి పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని సిపిఎం జిల్లా నాయకుడు బమ్మిడి ఆనందరావు, మండల కన్వీనర్ ఎన్.మోహనరావులు డిమాండ్ చేశారు. మండలంలోని నగరంపల్లి, పూండిగల్లి గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను రైతులతో గురువారం పరిశీలించారు. నష్టం వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షానికి కోసిన వరి పంటతో పాటు కుప్పలు తడిసిపోయి రైతులకు నష్టం మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరా పొలం సాగు చేయడానికి రైతులకు రూ.30 వేలు వరకు ఖర్చు అయిందన్నారు. కనీసం ఈ మొత్తాన్ని నష్టపరిహారంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. సుమారు 70 రోజుల పాటు వర్షాలు లేక, శివారు భూములకు వంశధార నీరు అందకపోవడంతో వేసి పంట ఎండిపోయిందని అన్నారు. ఉన్నవి గెడ్డలు, వాగుల్లో ఆయిల్ ఇంజిన్లతో నీరు తోడుకొని పంట పండిస్తే వర్షం రూపంలో నష్టం జరిగి నిరాశ మిగిల్చిందన్నారు.కౌలు రైతులు పరిస్థితి మరింత దయనీయంగా ఉందన్నారు. కౌలు రైతులను గుర్తించి వారికి నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బమ్మిడి రామకృష్ణ, ఎన్.చంద్రయ్య, ఎన్. జోగారావు, బి.లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

జ్ఞాపికను అందిస్తున్న కమిటీ సభ్యులు

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పట్టణంలో గురువారం రాత్రి జరిగిన నియోజకవర్గ ఐక్య క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సీదిరి అప్పలరాజు మాట్లాడారు. ఇదే కార్యక్రమంలో జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియ విజయ, ఎమ్మెల్యే అశోక్, ఎమ్మెల్సీ నర్తు రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు. క్రిస్మస్ వేడుకలు సందర్భంగా అనుకోకుండా ఇచ్ఛాపురం ఎమ్మెల్యే అశోక్ బాబు, మంత్రి అప్పలరాజు, వైసిపి ఇన్‌ఛార్జి పిరియా సాయిరాజ్ ఎదురుపడడం చర్చనీయాంశమైంది. రాజకీయ ప్రత్యర్థులు అయినప్పటికీ ఎదురు పడగానే పలకరించుకున్నారు. ఆంధ్రా బాపిస్ట్ చర్చ్ అధ్యక్షులు ప్రత్తి విజయకుమార్, జిల్లా క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు ప్రత్తి అన్వేష్ బాబు, పాస్టర్ జాన్ వేస్లీ ఉపన్యాసం చేశారు. కార్యక్రమంలో పాస్టర్ ఫెలో షిప్ కమిటి సభ్యులు, ఎంపిపి బోర పుష్ప, సీడ్ ఎపి చైర్మన్ శ్యామ్ ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్య యోజన కార్డులు పంపిణీ

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

కేంద్ర అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన పెంచుకోవాలని ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్ అన్నారు. మండలంలోని చిట్టేవలస, దంత పంచాయతీలలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ప్రధానమంత్రి జన్ అరోగ్య యోజన కార్డులను, ఉజ్వల పథకం కింద గ్యాస్ కనెక్షన్‌ను అందజేశారు. కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు మెట్ట తిరుమలరావు, సర్పంచ్‌లు సంపతిరావు వెంకటరమణ, గొండు చాందిని పాల్గొన్నారు.

రంగుమారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

మందస : ధర్నా చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి- మందస

మిచౌంగ్ తుపాను ప్రభావంతో తడిచిన, రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని టిడిపి మండల అధ్యక్షులు బావన దుర్యోధన, జనసేన మండల అధ్యక్షులు కె.గోపాల్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తుపాను ప్రభావంతో మందస మండల పరిధిలో చేతికి అంది వచ్చిన వరిపంటకు పూర్తిగా నష్టం వాటిల్లిందన్నారు.. అనంతరం డిటి ఎం.కృష్ణమూర్తిని కలిసి వినతిపత్రం అందజేశారు. రట్టి లింగరాజు, లబ్బ రుద్రయ్య, డుంకురు తిరుపతి, కర్రయ్య, కుప్పిలి వెంకటరావు, ఎం.నవీన్‌కుమార్, లఖియా, సంతోష్ పండా, సూర్య సంతోష్, ప్రసాద్ పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : అకాల వర్షాలతో శ్రీకాకుళం, గార మండలాల్లో రైతాంగానికి తీవ్రనష్టం వాటిల్లిందని, పంట పొలాల్లో పెద్దఎత్తున నీరు నిల్వ ఉండిపోవడంతో చేతికి అందిన పంట తడిచి ముద్దయిందని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీకాకుళం, గార మండలాల్లో గురువారం ఆమె పర్యటించి పంట పొలాల్లో రైతులతో మాట్లాడి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల దగ్గర ఉన్న ధాన్యాన్ని ప్రభుత్వం తక్షణమే కొనుగోలు చేసి మిల్లులకు తరలంచాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు లోపింటి రాధాకృష్ణ రెడ్డి, ప్రధాన కార్యదర్శి జల్లు రాజీవ్, మండల క్లస్టర్ ఇన్‌ఛార్జిలు అంబటి చక్రధర్, పొట్నురు కృష్ణమూర్తి, మండల కార్య నిర్వాహక కార్యదర్శి గంగు ప్రభాకర్, వజ్జ సూరిబాబు, మాజీ నీటిసంఘం అధ్యక్షులు పండి పరమేష్, జిల్లా రైతు సంఘం కార్యదర్శి యెన్ని గోపీ పాల్గొన్నారు.తుపాను దాటికి రైతుల జీవితాలు అస్తవ్యస్తంగా మారాయని, ఇటువంటి క్లిష్ట సమయంలో ప్రభుత్వం, అధికారులు రైతుల వైపు కన్నెత్తి చూడకపోవడం దారుణమని టిడిపి యువ నాయకులు గొండు శంకర్ ఆవేదన వ్యక్తం చేశారు.

మండలం సింగుపురం, భైరినాగులపేట గ్రామాల్లో తుఫాను దాటికి దెబ్బతిన్న పంట పొలాలను గురువారం పరిశీలించారు. పంట పొలాలను సందర్శించిన వారిలో రైతులు అరసవల్లి అప్పారావు, కంచు గోపి, కుంచాల రోహిణి, కుంచాల అప్పారావు, కుంచాల లక్ష్మణరావు, కుప్పిలి హరకేసం, కుంచాల రాజులమ్మ పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నుంచి రైతులకు కష్టాలు చుట్టు ముట్టాయని, సకాలంలో వర్షాలు లేక అనేక కష్టాలు పడి ఆరుగాలం పండించిన పంట చేతికి అందుతున్న సమయంలో మిచౌంగ్ తుపాను రూపంలో తీవ్ర నష్టాలను మిగిల్చిందని ఆలిండియా రైతు కూలీ సంఘం నాయకులు గొరకల బాలకృష్ణ, తాండ్ర ప్రకాష్‌లు పేర్కొన్నారు. నష్ట పోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గురు వారం పంట పొలాలను సందర్శించారు.

కవిటి : పంటలను పరిశీలిస్తున్న అధికారులు

ఆమదాలవలస: మండలంలో తుపాను ప్రభావంతో తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేయటానికి నాణ్యతా ప్రమాణాలను సడలించినట్లు మండల ఎఒ మెట్ట మోహనరావు తెలిపారు. గురువారం మండలంలో తురకపేట, శ్రీనివాసాచార్యులపేట, వెదుళ్లవలస, కొర్లకోట గ్రామాల్లో పర్యటించి తడిచిన పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో కొంతమేర వరిపంట కోతకోసి కుప్పలు పెట్టడం జరిగిందని, మిగిలిన గ్రామాల్లో కోసిన వరిపంట పనలు పొలంలో ఉండడంతో తడిచిపోయినట్లు గుర్తించడం జరిగిందన్నారు. కోసిన వరిపంటకు బీమా వర్తించదని, తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి ఏర్పాట్లు చేస్తామని, తడిచిన ధాన్యం మొలకలు రాకుండా, రంగు మారకుండా ఒకలీటరు నీటిలో ఐదుశాతం ఉప్పు కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు.

జి.సిగడాం : మండలం దవళపేట, మెట్టవలసలో ముంపునకు గురైన వరి పొలాలను మండల ఎఒ శారద పరిశీలించి రైతులకు నష్టం వాటిల్లకుండా రైతులకు సూచనలు చేశారు. నష్టాన్ని నివారించడానికి ఒక క్వింటా ధాన్యానికి ఒకకిలో ఉప్పు, 20 కిలోల పొడి ఊక కలిపి ధాన్యం పోగు పెట్టడం వల్ల గింజ మొలకెత్తకుండా, చెడిపోకుండా నివారించుకోవచ్చునన్నారు. అలాగే గింజ రంగు మారకుండా ఉండటానికి లీటరు నీటికి ఒక గ్రాము కార్బెండిజం లేదా రెండు గ్రాముల కార్బెండిజం మాంకోజెబ్ లేదా 1 మీ.లీ ప్రోపికొనజోల్ మందును పిచికారి చేయాలని రైతులకు సూచించారు. ఈమెతో పాటు గ్రామ అగ్రికల్చర్ అసిస్టెంట్లు ఉన్నారు.

వ్యవసాయాధికారుల పరిశీలన

కవిటి: మిచౌంగ్ తుపాను ప్రభావంతో మండలంలో నష్టపోయిన రైతుల పంట పొలాలను వ్యవసాయ అధికారులు గురువారం పరిశీలించారు. నెలవంక, కపాసుకుద్ది, జగతి, బెజ్జిపుట్టుగ, కవిటి తదితర గ్రామాల్లో నీటిలో ఉన్న వరిచేలు, పూర్తిగా పాడైన పంటలను ఎడిఎ కె.జగన్మోహనరావు సిబ్బందితో కలిసి అంచనా వేశారు. మండలంలో సుమారు 50 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లినట్టు ప్రాథమికంగా అంచనా వేశారు. మరో మూడు రోజుల్లో పూర్తి నివేదిక ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు. పరిశీలనలో ఎఒ పి.సత్యనా రాయణ, సహాయకులు ఉన్నారు.

పాముకాటుతో వ్యక్తి మృతి

గోవిందరావు (ఫైల్)

కోటబొమ్మాళి: మండలంలో హరిశ్చంద్రపురం పంచాయతీ చిన్నహరిశ్చంద్రపురానికి చెందిన గురువెళ్లి గోవిందరావు (45) గురువారం పాముకాటుకు గురై మృతి చెందాడు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తన పొలంలో ఉన్న వరి ఓవులు తడిచిపోయాయి. ఆ వోవులను తిరగవేస్తుండగా ఓవు కింద ఉన్న పాము కాటువేసింది. వెంటనే పొలంలో ఉన్న కుటుంబ సభ్యులు ద్విచక్ర వాహనంపై స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించగా... అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. స్థానిక పోలీసులు మృతదేహానికి పోస్టుమార్ధం నిర్వహించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య లక్ష్మి, ఇంటర్ చదువుతున్న కుమారుడు మణికంఠ, పదో తరగతి చదువుతున్న కుమార్తె కావ్యలు ఉన్నారు. మృతుడు ఆటో నడుపుతూ, వ్యవసాయం చేస్తూ జీవనం సాగించేవాడు. ఇంటి పెద్దను కోల్పోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

రేకు ఇల్లు దగ్ధం

కొత్తూరు : స్థానిక రెల్లి వీధిలో సొండి యకాశికి చెందిన రేకు ఇల్లు గురువారం దగ్ధమైంది. ఇంట్లో దేవుని గుడిలో దీపం పెట్టి ఇంట్లో తల్లి సువర్ణను ఉంచి శుభకార్యక్రమాన్ని వెళ్లిపోయారు. ఆ దీపం ఇంట్లో ఉన్న దుస్తులకు అంటుకుని ఒక్కసారిగా పొగలు రావడంతో వృద్ధురాలు సువర్ణ మెల్లగా బయటకు వచ్చేంది. సమాచారం అందుకున్న స్థానిక అగ్నిమాపక సిబ్బంది శకటంతో వచ్చి మంటలను అదుపు చేవారు. రూ.50 వేలు వరకు ఆస్తినష్టం ఉంటుందని అంచనా వేశారు. ఈ ప్రమాదంలో విద్యుత్ మీటరు, ఆధార్, రేషన్ కార్డులు, దుస్తులు దగ్ధమయ్యాయి.

మాట్లాడుతున్న శ్రావణ్ కుమార్

పోస్టల్ సేవలు విస్తృతం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

జిల్లాలో పోస్టల్ సేవలు విస్తృతం చేస్తున్నామని, ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ సూపరింటెండెంట్ పల్లి శ్రావణ్ కుమార్ అన్నారు. స్థానిక పోస్టాఫీసును గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పోస్టాఫీసు ద్వారా భీమా పథకాలను అమలు చేస్తుందన్నారు. ఐపిపిబి పథకాన్ని అమలులోకి తెచ్చిందన్నారు. ఈ పథకంలో లబ్ధిదారులు కేవలం ఆధార్ నంబరు, వేలిముద్రతో ఖాతాను ప్రారంభించవచ్చునని అన్నారు. ఇండియాలో ఎక్కడైన పోస్టాఫీసులో డబ్బులు విత్‌డ్రా చేసుకోవచ్చునన్నారు. అలాగే యేడాదికి రూ. 400లు చొప్పున్న బీమా చెల్లిస్తే రూ.పది లక్షలు ప్రమాద బీమా వర్తిస్తుందని అన్నారు. కార్యక్రమంల టెక్కలి అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ డి.వి.ఎన్.ప్రతాప్, స్థానిక పోస్టుమాస్టర్ మెండ ఉపేంద్రరావులు ఉన్నారు.

వినతిపత్రం అందిస్తున్న టిడిపి నాయకులు

రైతులను ఆదుకోవాలని వినతి

ప్రజాశక్తి- టెక్కలి

మిచౌంగ్ తుపాను కారణంగా వరిపంట కోతలు చేసిన సమయంలో తీవ్రంగా నష్టపోయిన రైతాంగాన్ని తక్షణమే ఆదుకోవాలని టిడిపి మండల పార్టీ అధ్యక్షులు బగాది శేషగిరి కోరారు. ఈ మేరకు తహశీల్దార్ కె.ప్రవల్లికాప్రియను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి రైతులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. ఒకపక్క వర్షాలు లేక, మరోపక్క సాగునీటి వనరుల ద్వారా వంశధార నీరు ప్రవహించకపోవడంతో ఇబ్బందులు పడ్డారని అన్నారు. ఇన్ని ఇబ్బందులు ఎదుర్కొని పంట పండిస్తే కోతల సమయంలో వర్షాలు వల్ల ధాన్యం తడిసిపోయని తెలిపారు. తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో హనుమంతు రామకృష్ణ, మామిడి రాము, మట్ట పురుషొత్తం, పోలాకి షణ్ముఖరావు, మెండ దమయంతి, కోళ్ల లవకుమార్, ఇప్పిలి జగదీష్, సోడిముడి కిరణ్‌కుమార్, కెల్లి శ్రీరాములు, దల్లి ప్రసాద్‌రెడ్డి, కోళ్ల కామేష్ పాల్గొన్నారు.

సర్కారు భవనాలు శిథిలం

భయాందోళనలో అధికారులు

శిథిలావస్థలో ఎంపిడిఒ కార్యాలయం

ప్రజాశక్తి- పలాస

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిపాలనలో భాగంగా ప్రజలకు సేవలు అందించేందుకు చాలా ఏళ్ల క్రితం ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. శిథిలావస్థలో ఉన్న భవనాల్లో తమ విధులు నిర్వహించేందుకు అధికారులు భయాందోళనకు గురవుతున్నారు. మండలంలోని మండల పరిషత్ కార్యాలయం సుమారు 50 ఏళ్ల క్రితం నిర్మించారు. భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో మండల ప్రజలతో పాటు అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. తిత్లీ తుపాను సమయంలో మండల సమావేశ మందిరం పైకప్పు ఎగిరిపోయింది. రూ.లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన సీలింగ్ పూర్తిగా నాశినమైంది. నూతన భవనం నిర్మించేందుకు మండల పరిషత్ కార్యాలయంలో కొంత స్థలాన్ని ఎల్ఐసి సంస్థకు అమ్మకం చేపట్టారు. అయితే ఆ నిధులతో నిర్మాణం చేస్తామని అనుకున్న సమయంలో నిధులు కలెక్టర్ కార్యాలయానికి వెళ్లిపోయాయి. దీంతో భవన నిర్మాణ పనులకు నోచుకోలేదు. ప్రస్తుతం భవనంలో వ్యవసాయశాఖ కార్యాలయంతో పాటు సచివాలయం ఉద్యోగులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. భవనం చాలా ఏళ్ల క్రితం నిర్మించడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. అలాగే పలాస ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయం, పంచాయతీరాజ్ డివిజన్ కార్యాలయాలు శిథిలావస్థలో ఉన్నాయి. ప్రస్తుతం పంచాయతీరాజ్ అధికారులు పక్కన ఉన్న డివిజన్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు కార్యాలయానికి సమీపంలో ఉన్న పాత ఇఇ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. పాత భవనాలకు మరమ్మతులు చేపట్టకపోవడంతో శ్లాబ్ పిచ్చులూడడంతో బయటకు దర్శనమిస్తున్నాయి. శాబ్ పిచ్చులు పడుతుండడంతో ఎప్పుడూ ఏ ప్రమాదం సంభవిస్తుందోనని అధికారులు భయాందోళన చెందుతున్నారు. పాత భవనాలకు సమయం మించిపోయినా పాలకులు, అధికారులు నూతన భవనాలు మంజూరు చేయకపోవడంతో అధికారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు జిల్లా ఉన్నత అధికారులు చొరవ చూపి పాడైన భవనాలకు మరమ్మతులు చేపట్టడమే కాకుండా నూతన భవనాలు మంజూరు చేయాలని మండల ప్రజలు, అధికారులు కోరుతున్నారు. ఇదే విషయంపై ఎంపిడిఒ ఎన్.రమేష్‌నాయుడును వివరణ కోరగా, భవనాలు శిథిలావస్థకు చేరుకోవడం వాస్తవమేనని అన్నారు. నూతన భవనాలు మంజూరుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామని తెలిపారు.

వికలాంగులకు వాహనాలు

ప్రజాశక్తి- రణస్థలం

స్థానిక ఎచ్చెర్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ సామజిక బాధ్యతలో భాగంగా మండలంలో ముగ్గురు వికలాంగులకు ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అభ్యర్థన మేరకు మూడు టివిఎస్ త్రీ మోటార్ చక్రాల స్కూటర్లును ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ చేతులమీదుగా అరబిందో ఫార్మా ఫౌండేషన్ ప్రతినిధులు సమక్షంలో ముగ్గురు వికలాంగులకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అరబిందో ఫార్మా ఫౌండేషన్ యాజమాన్యం నిత్యానంద రెడ్డి, శరత్ చంద్రరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో

బైక్‌లను అందజేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

జెడ్‌పిటిసి టొంపల సీతారాం, మండల జెసిఎస్ ఇన్‌ఛార్జి చిల్ల వెంకట్ రెడ్డి, వైస్ ఎంపిపి ప్రతినిధి మైలపల్లి కామరాజు, స్టేట్ అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కింతలి రమేష్ బాబు, ఎఫ్ఎస్‌సిఎస్ అధ్యక్షులు కిల్లారి రమణ, పాతర్ల పల్లి సర్పంచ్ గొర్లె రాధాకృష్ణ, కృష్ణాపురం సర్పంచ్ కంబపు రామిరెడ్డి, బుడుమూరు సర్పంచ్ ప్రతినిధిపెదనాయుని అప్పల నర్సు నాయుడు, నాయకులు కెల్ల రామకృష్ణ పాల్గొన్నారు.

10న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సభ

మాట్లాడుతున్న శ్రీరాములు

శ్రీకాకుళం అర్బన్ : విజయవాడ జింకానా గ్రౌండ్స్‌లో ఈ నెల 10న జరగనున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ప్రథమ మహాసభకు జిల్లా నుంచి కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఎపి జెఎసి అమరావతి జిల్లా చైర్మన్ కె.శ్రీరాములు పిలుపునిచ్చారు. గురువారం నగరంలో రెవిన్యూ అతిథి గృహంలో జెఎసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పనిచేస్తున్న లక్షలాది మంది కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించి, వారికి మెరుగైన జీతభత్యాలు, వైద్యం, ఆర్థిక, ఆర్థికేతర సమస్యల పరిష్కారం కోసం ఎపి జెఎసి పోరాడుతోందన్నారు. సమస్యల పరిష్కారానికి మరిన్ని పోరాటాలు అవసరమన్నారు. సమావేశంలో జెఎసి నాయకులు, అసోసియేట్ చైర్మన్ పి.లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శి ఎస్.వి రమణ, రెవిన్యూ సర్వీసుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.వేణు గోపాలరావు, జిల్లా కార్యదర్శి బివివిఎన్.రాజు, సహాధ్యక్షులు పి.శ్రీనివాసరావు, ట్రెజరర్ జిఎల్.శ్రీనివాసరావు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగ నాయకులు గణేష్, రవి, చందు, సిద్దు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

సిఎం జగన్మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని పరశురాంపురం సచివాలయం పరిధిలో ఎపికి జగన్ ఎందుకు కావాలి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను ఎగురవేసి, సంక్షేమ పథకాల ఛార్ట్‌ను ప్రదర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్య, వైద్యం, వ్యవసాయానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. వైసిపి ప్రభుత్వం రైతులకు రైతు భరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన విత్తనాలు, వ్యవసాయ యాంత్రీకరణ, రైతుభరోసా వంటి పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ జగన్ ప్రభుత్వం వచ్చినట్లయితే మరిన్ని సంక్షేమ పథకాలు అందుతాయని అన్నారు. పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి బైపోతు ఉదయ్‌కుమార్, జెడ్‌పిటిసి గూడ ఎండయ్య, వైసిపి మండల కన్వీనర్ పల్లి యోగి, సర్పంచ్‌లు టి.ప్రసాదరావు, ఈశ్వరరావు, ఇఒపిఆర్‌డి టి.తారకేశ్వరి పాల్గొన్నారు.

మెళియాపుట్టి : పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

కవిటి: మండలంలోని బెలగాంలో జగనే ఎందుకు రావాలని కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్, సర్పంచ్‌లు మద్దిలి ఈశ్వరరావు, బద్రి ప్రకాష్, డి.నేతాజీ, బి.వాసుదేవ్, గణేష్ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి : మండలంలోని లఖందిడ్డిలో జగన్ ఎందుకు రావాలి కార్యక్రమంలో ఎంపిపి ఉమామల్లేశ్వరరావు, ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్, కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు, సర్పంచ్ బమ్మిడి గణపతి, జెఎస్‌సి కన్వీనర్ గడ్డవలస నాగభూషణరావు, పేడాడ వెంకటరావు, మెట్ట సింహాచలం, సింగుపురం వినోద్, హనుమంతు తేజ, బమ్మిడి శ్రీరాములు, రామకృష్ణ పాల్గొన్నారు.

కుల గణనపై ప్రత్యేక దృష్టి

పలాస : ప్రభుత్వం చేపట్టిన కులగణపై అందరూ దృష్టి సారించాలని పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో వివిధ తరగతుల సంఘ నాయకులతో కుల గణనపై అవగాహనా సదస్సు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుల గణనతో సమాజంలో ఉన్న తరగతుల స్థితిగతులు తెలుసుకోవచ్చని తెలిపారు. కుల గణన చేసేటప్పుడు సంబంధిత అధికారులు గడప గడపకు వెళ్లి వివరాలు సేకరించాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ టి.నాగేంద్రకుమార్, తహశీల్దార్ ఎల్.మధుసూదనరావు పాల్గొన్నారు.

పొందూరు: మండలంలో కొద్దిరోజుల్లో చేపట్టనున్న కులగణనకు ప్రతిఒక్కరు సహకారం అందించాలని ఎంపిడిఒ సీపాన హరిహరరావు పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం కులగణనపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నుంచి అభిప్రాయాలను సేకరించారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి కిల్లి నాగేశ్వరరావు, తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ కిల్లాన సూర్యారావు, నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ గంగిరెడ్ల ఉమాదేవి, కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ కె.వీరస్వామి, శ్రీశయిన కార్పొరేషన్ డైరెక్టర్ పోలాకి నాగభూషణ్, ఇఒపిఆర్‌డి సింహాచలం, పంచాయతీ సెక్రటరీలు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పలాస : మాట్లాడుతున్న చైర్మన్ గిరిబాబు

సరుబుజ్జిలి : మండల పరిషత్ కార్యాలయంలో కులగణన సర్వేపై స్థానిక ఎంపిడిఒ పివిపి మురళీ మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులతో పాటు పలుపార్టీల నాయకులు, పలు కులాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు కెవిజి సత్యనారాయణ, తహశీల్దార్ వి.లక్ష్మీనారాయణ, ఇఒపిఆర్‌డి జె.ఆనందరావు పాల్గొన్నారు.

పలాస : పోస్టర్‌ను అందజేస్తున్న గౌతు శిరీష

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

ప్రజాశక్తి- పలాస

వైసిపి ప్రభుత్వంలో రాష్ట్రం సర్వనాశనమైందని, రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో చినబడాంలో గురువారం బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ముందుగా వార్డులో పర్యటించి వైసిపి ప్రభుత్వం చేపడుతున్న ఆక్రమణలు, అరాచకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా టిడిపి మేనిఫెస్టోతో కూడిన పోస్టర్లను ఇంటింటికీ వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంత్రి సీదిరి అప్పలరాజు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయకపోగా, కొండలు, గుట్టలు వాగులు ఆక్రమించుకున్నారని ఆరోపించారు. రైల్వే వంతెనకు రెండోసారి శంకుస్థాపన చేసి ఇప్పటికీ రైల్వే వంతెన పూర్తి చేయలేకపోయారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, బి.నాగరాజు, గాలి కృష్ణారావు, అంబటి కృష్ణమూర్తి, సప్ప నవీన్ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: రాష్ట్ర ప్రజలు వైసిపి పాలనతో విసుగుచెంది మార్పు కోరుకుంటున్నారని టిడిపి సీనియర్ నాయకుడు, మాజీ ఎంపిటిసి సభ్యులు హనుమంతు అప్పలరాజు అన్నారు. మండలంలోని హరిశ్చంద్రపురంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో లింగుబారి రామప్పడు, డోకి నానాజీ, గంగిట్ల అప్పన్న, ఉప్పాడ సింహాచలం పాల్గొన్నారు.

విశ్రాంత డిఎస్‌పి ఆర్థికసాయం

కవిటి: తరతరాలు వారసత్వంగా వస్తున్న మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపైనా ఉందని విశ్రాంత డిఎస్‌పి ఎ.ఎస్.వి.వి.ప్రసాదరావు అన్నారు. కవిటి బెహరా వీధిలో పునర్నిర్మితమవుతున్న జగన్నాథస్వామి ఆలయానికి తన మనుమరాలు అరియా, మనుమడు విరాట్ తరుపున రూ.10 వేలు గురువారం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్నాథస్వామిని పునర్నించడం శుభ పరిణామమని అన్నారు. అలాగే సహలాలపుట్టుగలో అమ్మవారి ఆలయ నిర్మాణానికి రూ.10వేలు, కవిటిలోని వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి రూ25 వేలు అందించారు. అంతేకాకుండా తన స్నేహితులైన జమేదారుపుట్టుగకు చెందిన కృష్ణా రౌలో 200 బస్తాలు, విశాఖపట్నానికి చెందిన రోహన్ కుమార్ 125 బస్తాలు, కవిటికి చెందిన మొగిలిపురి కష్ణారావు 100 బస్తాలు, శ్రీరాంపురానికి చెందిన మాదిన వెంకటరమణమూర్తి 100 బస్తాల సిమెంట్ వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి అందించారు. కార్యక్రమంలో బర్ల నాగభూషణం, బెందాళం వేణు, మొగిలిపురి సీతాలు, బిపి రెడ్డి, తిరుపతి బెహరా పాల్గొన్నారు.

విరాళం అందిస్తున్న ప్రసాదరావు

అందుబాటులో ఉన్న పరికరాలు

అందుబాటులో వ్యవసాయ యంత్ర పరికరాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల రైతాంగానికి అవసరమైన వ్యవసాయ యంత్ర పరికరాలు తమ వద్ద అందుబాటులో ఉన్నాయని, తక్కువ ధరకు వీటిని కొనుగోలు చేసుకునేందుకు వీలుందని నగరంలోని కుశాలపురం ఆర్చి వద్ద గల వినాయక ఆగ్రో ఇండస్ట్రీస్ ప్రకటించింది. రైతులకు కావాల్సిన అన్ని రకముల అత్యాధునిక వ్యవసాయ యంత్రాలు అతి తక్కువ ధరలో అందుబాటులో ఉన్నాయని, హోల్‌సేల్, రిటైల్ ధరలకు ప్రభుత్వ రాయితీపై అందించడం జరుగుతుందని యాజమాన్యం తెలిపారు. అన్నిరకాల వ్యవసాయ యంత్రాలపై 10 నుంచి 30 శాతం వరకు రాయితీ ఉంటుందన్నారు. క్రెడిట్ అండ్ డెబిట్ కార్డులను అనుమతిస్తున్నామన్నారు. వరిచేను కొతకోసే మిషన్లు, దుక్కు దున్నే మిషన్లు, విత్తనాలు నాటే యంత్రాలు, బ్రష్ కట్టర్స్, బ్యాటరీ, పవర్ స్ప్రేయర్స్, నూర్పు మిషన్లు, గుంతలు తీయు యంత్రం, ట్రాక్టర్ రోటోవేటర్స్, ఛాఫ్ కట్టర్స్, మిల్క్ మిషన్లు, పెట్రోల్ అండ్ డీజిల్ వాటర్ ఇంజన్లు, చెట్లు కట్ చేసే యంత్రాలు అందుబాటులో ఉన్నట్టు తెలిపారు. ఫ్రీ మెకానిక్ సర్వీస్‌లు,స్పేర్స్ కూడా అందుబాటులో ఉన్నట్టు సంస్థ యాజమాన్య ప్రతినిధి విజయకుమార్ తెలిపారు.

రహదారిని ప్రారంభిస్తున్న పరిశ్రమ ప్రతినిధులు

గ్రావెల్ రోడ్డు ప్రారంభం

రణస్థలం: మండలంలో అరోబిందో ఫార్మా అనుబంధ సంస్థ పైడిభీమవరం పంచాయతీలో ఉన్న శ్రేయాస్ ఇండస్ట్రీస్ - ఆక్సిస్ క్లినికాల్స్ లిమిటెడ్ మద్దతుతో సామజిక బాధ్యతలో భాగంగా ఎన్‌జిఆర్.పురం, అక్కయ్యపాలెం గ్రామాల్లో ఉన్న ప్రజలకు ఉపయోగపడేలా గ్రావెల్ రోడ్లును శ్రేయాస్ ఇండస్ట్రీస్ అండ్ అరోబిందో ఫార్మా ప్రతినిధులు గురువారం గ్రావెల్ రోడ్లును ప్రారంభించారు. సిఎస్ఆర్ నిధుల కింద సామాజిక ప్రయోజనం పట్ల నిస్వార్థ ప్రయత్నాలతో అపారమైన మద్దతుకు అభినందనీయమని ఆక్సిస్ క్లినికాల్స్ లిమిటెడ్ యాజమాన్యం ప్రతినిధులు నిత్యానంద రెడ్డి,.శరత్ చంద్రరెడ్డికి గ్రామ పంచాయతీ పెద్దలు, గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

కొత్తూరు : స్థానిక భవిత మానవవనరుల కేంద్రంలో ఇటీవల వికలాంగులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ మేరకు విజేతలకు వైసిపి నాయకులు లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వికలాంగులపై ప్రేమ పూర్వకంగా మెలగాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి సవర సావిత్రి, ప్రత్యేక ఆహ్వానితులు ఎ.ప్రశాంత్, ఎంఇఒ ఎన్.శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు ఎ.గోవిందరావు, ఎస్.రమేష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తహశీల్దార్ వేణుగోపాలరావు

రీ సర్వేపై గ్రామసభ

ప్రజాశక్తి- జి.సిగడాం

మండలం జగన్నాథవలస గ్రామంలో భూసర్వేపై గురువారం గ్రామసభ నిర్వహించారు. గ్రామసభలో తహశీల్దార్ పి.వేణుగోపాలరావు మాట్లాడుతూ రైతులందరూ రీసర్వేకు సహకరించాలని కోరారు. అలాగే భూమికి సంబంధించి ఎటువంటి మార్పులు, చేర్పులు చేయాలన్నా దానికి సంబంధించిన డాక్యుమెంట్లను రీసర్వే సమయంలో సర్వేయర్, విఆర్ఒకు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి రామచంద్రరావు, రీసర్వే డిటి గాయత్రి, మండల సర్వేయర్, సచివాలయం సిబ్బంది, గ్రామ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

సిఎస్‌పి రోడ్డు గోతులమయం

ప్రజాశక్తి- బూర్జ

పాలకొండ-శ్రీకాకుళం సిఎస్‌పి రహదారిపై మండలంలో రామన్నపేట జంక్షన్ వద్ద రోడ్డు మొత్తం పెద్దపెద్ద గోతులు ఏర్పడడంతో పెను ప్రమాదం జరిగేందుకు అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు. ఇదే ప్రాంతంలో గతంలో పలు ప్రమాదాలు చోటుచేసుకుని ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రామన్నపేట వద్ద గోతులమయమైన రోడ్డు

దళారులను నమ్మొద్దు

ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, పారదర్శకం గా ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని పరశురాంపురం రైతు భరోసా కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వం ఆర్‌బికెల ద్వారా కొనుగోలు చేస్తుందన్నారు. అందుకు ప్రతి రైతూ ఆర్‌బికెల్లో ధాన్యాన్ని విక్రయించాలన్నారు. ఈ సంవత్సరం సాధారణ వరి రకం ధాన్యం క్వింటాకు రూ.2,183, గ్రేడ్-ఎ రూ.2,203 ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయించిందని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులందరూ వినియోగించు కోవాలని సూచించారు. గోని సంచి, కూలీల, రవాణా ఖర్చులూ ప్రభుత్వం రైతులు ఖాతాలో జమ చేస్తుందని అన్నారు. ఈ సంవత్సరం జిపిఎస్ అమర్చిన వాహనాల్లో ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తుందని చెప్పారు. అనంతరం రైతులకు రాగి విత్తనాలను రాయితీపై అందించారు. కార్యక్రమంలో తహశీల్దార్ పి.సరోజని, ఎంపిపి ప్రతినిధి బి.ఉదయ్ కుమార్, జెడ్‌పిటిసి గూడ ఎండయ్య, వైసిపి మండల కన్వీనర్ పల్లి యోగి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మాధవరావు, మండల ఎఒ దానకర్ణుడు, సర్పంచ్‌లు తెంబూరు ప్రసాదరావు, ఎవ్వరి ఈశ్వరరావు అగ్రికల్చర్ అసిస్టెంట్ దుక్క శరత్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

అపరాల సాగుకు మంచి తరుణం

తడిసిన పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

వజ్రపుకొత్తూరు : రైతులు అపరాలు పంటలు వేసుకోడానికి ఇదే మంచి తరుణమని వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు సూచించారు. మిచౌంగ్ తుపాన్ కారణంగా పంటలు దెబ్బతిన్న బెండి, సీతాపురం, పూండిగల్లి ప్రాంతా ల్లో గురువారం సందర్శించారు. వర్షానికి తడిసిన పనలను తిరగేయాలని, నీటిలో మునిగిన పనలపై 5 శాతం ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలని సూచించారు. వరి కుప్పలు పెట్టిన రైతులు అడుగు భాగంలో ఉన్న పనలను తీసి చూసి తడిసి ఉన్నట్లయితే నూర్పులు చేసుకోవడం మంచిది అన్నారు. ఈ వాతావరణం ఆరుతడి పంటలైన పెసర, మిను ము వేసుకోడానికి అనుకూలం అన్నారు. నువ్వులు వంటి నూనె గింజలు పంటలు వేసుకోడానికి జనవరి నెల అను కూలంగా ఉంటుందని వివరించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ ఉదయ్‌బాబు, నీలవేణి, డిఆర్‌సి ఎడిఎ వెంకటరావు, మం డల ఎఒ కిరణ్‌వాణి, ఎఇఒలు జ్యోత్స్న, రఘు పాల్గొన్నారు.

రణస్థలం రూరల్: మండలంలో తుపానుతో నష్టపోయిన ప్రాంతాలనురాగోలు రసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ కె.మధుకుమార్, సంధ్యారాణి, స్వాతి, ఎడిఎ శ్రీనివాసరావు, ఎఒ డి.విజయ భాస్కరరావు పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న గీత

పదో వార్డులో పారిశుధ్య పనులు

పలాస : ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు కారణంగా వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, అందుకు అందరూ అప్రమత్తంగా ఉండాలని 10వ వార్డు కౌన్సిలర్ సర్వాన గీత అన్నారు. ఈ మేరకు వార్డు పరిధిలో శివాలయం వీధిలో గురువారం చేపడుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. తాగునీటి బావుల్లో క్లోరినేషన్ చేపట్టాలని సచివాలయం ఆరోగ్య, శానిటేషన్ కార్యదర్శికు సూచించారు. వార్డు పరిధిలో ఎప్పటికప్పుడు కాలువల్లో పేరుకు పోయిన అపారిశుధ్యం తొలగింపు చర్యలు చేపట్టాలని, ఎక్కడ చెత్త, చెదారలను నిలువ లేకుండా చూడాలని శానిటేషన్ సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ అధ్యక్షులు చిత్తరెడ్డి శ్రీనివాస్, శానిటేషన్ కార్యదర్శి త్రినాథ్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మోహన్ పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న కమిషనర్ నాగేంద్రకుమార్

రోడ్డు పనులు పరిశీలన

పలాస: మున్సిపాలిటీ కెటి రోడ్డు 80 అడుగుల విస్తరణ పనులు పూర్తికి ఉన్న అడ్డంకులు తొలగిపోయినట్టేనని కమిషనర్ టి.నాగేంద్రకుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్డు విస్తరణ పనులు ఇప్పటికే దాదాపు పూర్తయినా, రోడ్డుపై ఉన్న పాత విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించి, రోడ్డుకి అవతలి వైపు మార్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కెటి రోడ్డుపై ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు తొలగిస్తే... పూర్తిస్థాయిలో 80 అడుగుల రోడ్డు పనులు పూర్తయినట్లేనని చెప్పారు. రాజా లాడ్జి, ముత్యాలమ్మ కోనేరు పార్కు తదితర ప్రాంతాలలో ట్రాన్స్‌ఫార్మర్ల మార్పు పనులు తొందరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ని ఆదేశించారు. పనులు పరిశీలించిన వారిలో మున్సిపల్ డి ఇ సునీల్ కుమార్, ఎ ఇ అవినాష్, 9 వార్డు కౌన్సిలర్ గుజ్జు జోగారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే భవిష్యత్

అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి- పలాస

విద్యార్థులు ఉన్నత శిఖరా లను అధిరోహి ంచాలంటే విద్య ఒక ఆయుధంలా ఉపయోగ పడుతుందని పశు సంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. పలాస ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న పిఇటి పి.తవియ్య తన తల్లిదండ్రులు అచ్చమ్మ, పోతయ్య జ్ఞాపకార్థంగా తన సొంత నిధులతో నిర్మించిన అంబేద్కర్ విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే ఒక లక్ష్యాన్ని పెట్టుకొని ముందుకు ప్రయాణం చేయాలన్నారు. సమాజంలో ప్రతిఒక్కరూ సమానంగా ఉండాలని, అందుకు రాజ్యాంగాన్ని రచించిన గొప్ప వ్యక్తి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ అన్నారు. దేశం ప్రగతి పథంలో ముందుకు సాగేందుకు అంబేద్కర్ ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు, పాఠశాల ప్రధానో పాధ్యాయులు డి.దాసరథి, ఎఎంసి చైర్మన్ పి.వి.సతీష్, కౌన్సిలర్లు దున్న సత్యం, సనపల సింహాచలం, శిష్టి గోపి, వైసిపి నాయకులు తూముల శ్రీనివాసరావు, అంబటి ఆనంద్ పాల్గొన్నారు.

ట్రస్టు సేవలు విస్తృతం

చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

టెక్కలి: కీర్తిశేషులు కోర్ల రేవతీపతి పేరున నిర్వహిస్తున్న ట్రస్టు సేవలు గ్రామీణ ప్రాంతాల్లోనూ విస్తరించే విధంగా చర్యలు తీసుకోవాలని అంబేద్కర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ రాజేంద్రప్రసాద్ అభిప్రాయ పడ్డారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ తెంబూరు గోవిందమ్మ అధ్యక్షతన విద్యార్థులకు అవసరమైన గైడెన్స్ కోచింగ్ సెంటర్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఆందుబాటులో సేవలు కొనసాగించాలన్నారు. కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి మాట్లాడుతూ విద్యార్థులకు అందుబాటులో ఉన్న సేవలను వినియోగించే క్రమంలో స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం హర్షణీయమని అన్నారు. ట్రస్టు చైర్మన్ చిగిలిపల్లి శిరీష శ్రీనివాస్‌లు మాట్లాడుతూ విద్య, వైద్యం, సాహిత్యంతో పాటు అన్నిరంగాల్లోనూ సామాజిక అంశాలపై సేవలు విస్తరిస్తామని అన్నారు. ముందుగా మాజీ ఎమ్మెల్యే రేవతీపతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. సమావేశంలో టెక్కలి మాజీ ఎమ్మెల్యే కొర్ల భారతి, సంతబొమ్మాళి జడ్‌పిటిసి పాల వసంతరెడ్డి, చింతాడ గణపతి, కోత మధుసూదనరావు, పాతపట్నం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీరాములు, ఎన్ని మన్మథరావు, ఆట్ల రాహుల్ పాల్గొన్నారు.

నేలమట్టమైన వరి పంట

వరి పంట నేలమట్టం

పోలాకి: మిచౌంగ్ తుపాను ప్రభావంతో కురిసన వర్షానికి వరి పంట నేతలకొరిగాయి. మండలంలో సుమారుగా 80 శాతం వరకు కోతలయ్యాయి. మండలంలోని తలసముద్రం, మబగాం, వనితమండలం, కత్తిరివానిపేట, గజిపతినగరం, ఈదులవలస, డోల, ఎస్.ఎల్.పురం, బెలమర, డి.ఎల్.పురం, సుసరాం, పిర్యాగ్రహారం, పోలాకి గ్రామాల్లో వరి చేలు నేలమట్టమయ్యాయి.

ఘనంగా 'బగ్గు' పుట్టిన రోజు

పోలాకి: పోలాకి, నరసన్నపేట మండలాల్లో నరసన్నపేట మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. అభిమానులు కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం గొట్టిపల్లి వృద్ధాశ్రమంలో వృద్ధులకు పళ్ల పంపిణీ, భోజనాలు వడ్డించారు.

టిడిపి హయాంలోనే సంక్షేమం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో పేదలకోసం సంక్షేమ పాలన అందించిన టిడిపి సంక్షేమ పథకాలను అడ్డు కుంటోందని వైసిపి నాయకులు ప్రచారం చేయడం విడ్డూరంగా ఉందని మాజీ మంత్రి గుండ అప్పల సూర్యనారాయణ అన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలను తీసుకొచ్చింది తెలుగుదేశం ప్రభుత్వ పాలనలోనేనని గుర్తు చేశారు. గురువారం అరసవల్లిలో ఆయన స్వగృహంలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవితో కలిసి విలేకరులతో మాట్లాడారు. స్వర్గీయ ఎన్‌టిఆర్ టిడిపిని పేదలకోసమే పెట్టారని, సంక్షేమానికి ఆయన చెరగని ముద్ర వేశారన్నారు. అదే బాటలో చంద్రబాబు పాలన సాగిందన్నారు. అభివృద్ధి, సంక్షేమం టిడిపి హయాంలోనే సాధ్యమైందన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో టిడ్కో ఇళ్లు నిర్మాణం చేపడితే వాటిని నేటికీ ప్రజలకు అప్పగించకుండా పేదలకు అన్యాయం చేశారన్నారు. స్థల సేకరణ పేరుతో రూ.కోట్లు కాజేసిన వైసిపి నాయకులు నివాస యోగ్యంకాని ప్రాంతాల్లో పేదలకు స్థలాలు ఇచ్చారన్నారు. రాష్ట్రానికి చంద్రబాబు నాయకత్వం అవసరం ఉందని ప్రజలు గుర్తించారని, రానున్న రోజుల్లో వైసిపి నాయకులకు ప్రజలే గుణపాఠం చెపుతారన్నారు.

మాట్లాడుతున్న అప్పలసూర్యనారాయణ